JAYABHERIDAILY.COM

ప్రభాత జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి I మంగళవారం 10-11-2026

Medchal - Malkajgiri I Tuesday 10-11-2026

Follow: jayabherinews

సంపుటి : 03 I సంచిక : 160

పేజీలు : 8 I వెల : 5

Vol. 03 I Issue 160 I Pages : 8 I ₹: 5



ఎల్లమ్మ సాక్షిగా రేవంత్ మాట..

కొడంగల్‌కు కృష్ణమ్మ బాట!



- రూ.9,053 కోట్లతో అభివృద్ధి బాట.. 13 భారీ ప్రాజెక్టులకు శ్రీకారం!
- పాలమూరు కన్నీళ్లు తుడుస్తాం.. పచ్చని పంటలతో సీమను నింపుతాం!
- రోడ్లు.. రిజర్వాయర్లు.. పరిశ్రమలు.. కొడంగల్‌కు అభివృద్ధి జాతర!
- ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి
- అప్పులు చెల్లిస్తూనే.. అభివృద్ధి పరుగులు!
- పాలమూరుకు కొత్త దిశ.. కొడంగల్‌పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి

✍ జయభేరి, కొడంగల్ :

గత ప్రభుత్వం చేసిన అప్పులను ఒకవైపు చెల్లిస్తూనే, మరోవైపు తెలంగాణలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కరువు, కాటకాలు, వలసలతో సతమతమైన పాలమూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని లగచర్ల ఇండస్ట్రియల్ పార్కులో నిర్వహించిన రైతన్నతో ఆత్మీయ సభలో సీఎం ప్రసంగించారు. కొడంగల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కొడంగల్ ప్రాంత రైతుల భూములకు కృష్ణానది జలాలను అందించి పచ్చని పంటలు పండించేలా చేయడం తన బాధ్యతని సీఎం ప్రకటించారు. 2028 డిసెంబర్ నాటికి కృష్ణా జలాలతో కొడంగల్ భూములను తడిపిస్తానని పోలేపల్లి ఎల్లమ్మ అమ్మవారి సాక్షిగా మాట ఇచ్చారు. మక్తల్-నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులకు రూ.2,100 కోట్లతో శ్రీకారం చుట్టారు. గత ఏడు దశాబ్దాలుగా పాలమూరు అభివృద్ధికి నోచుకోలేదని, ఎంతోమంది నాయకులు అధికారంలోకి వచ్చినా

...మిగతాది 2 లో



- కాంగ్రెస్ సర్కార్‌పై సమరశంఖం!
- గోదావరి, కృష్ణా జలాలున్నా రైతులకు సాగునీరు అందడం లేదంటూ బీఆర్ఎస్ ఆగ్రహం
- కరెంటు కోతలు.. ఎండుతున్న పంటలు.. ఉపాధి లేక వలసబాట పడుతున్న రైతన్నలు!
- రేవంత్ సొంత జిల్లా పాలమూరులోనే రైతుల గోస.. నడిగడ్డలో మళ్లీ మొదలైన వలసలు
- కేసీఆర్ మళ్లీ వస్తారు.. రైతులను కడుపులో పెట్టుకుని చూసుకుంటాం: బీఆర్ఎస్ నేతలు

రైతన్నల కోసం.. బీఆర్ఎస్ సమరభేరి

రైతు గర్జన.. కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ సమరశంఖం!

- నీళ్లు లేవు.. కరెంటు లేదు.. రైతులకు కష్టాలే!
- రైతుల హక్కుల కోసం పోరాటం.. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిలదీత.. ఇదే బీఆర్ఎస్ రైతు గర్జన నినాదం!
- రైతుల ఆగ్రహం.. ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం!
- కేసీఆర్ పాలన మళ్లీ రావాలంటున్న బీఆర్ఎస్
- నవంబర్ 11న నిర్మల్‌లో రైతు గర్జన

✍ జయభేరి, హైదరాబాద్ :


తెలంగాణలో రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి, విద్యుత్ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ రైతు గర్జనకు సిద్ధమైంది. గోదావరి, కృష్ణా నదుల్లో సమృద్ధిగా నీటి వనరులు ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోకుండా రైతులను కరువు కోరల్లోకి నెట్టారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇది ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల ఏర్పడిన కరువని విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి పాలమూరులోని కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న నడిగడ్డ ప్రాంతంలో సాగునీరు అందక, విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. వ్యవసాయ పనులు లేక ఉపాధి కోసం ప్రజలు హైదరాబాద్‌తో పాటు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని పేర్కొంటోంది. గతంలో వలసలకు మారుపేరుగా నిలిచిన పాలమూరులో మళ్లీ అదే పరిస్థితులు నెలకొంటున్నాయని విమర్శిస్తోంది. కరెంటు సరిగా రావడం లేదని, సాగునీరు అందడం లేదని, బోరు మోటార్లు కూడా నడపలేని పరిస్థితి ఏర్పడిందని ఓ మహిళ తన ఆవేదన వ్యక్తం చేసినట్లు బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది.

కేసీఆర్ పాలనలో రైతులకు సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబంధు వంటి పథకాలతో భరోసా లభించిందని బీఆర్ఎస్ నేతలు గుర్తుచేస్తున్నారు. మరో ఏడాదిలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని, రైతుల సంక్షేమ బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్‌లో భారీ రైతు గర్జన సభ నిర్వహించనున్నారు. రైతులు, పార్టీ శ్రేణులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చింది.

మేం ప్రజలను నమ్ముకున్నాం..

వాళ్లు నేరాలను నమ్ముకున్నారు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపిన సీఎం చంద్రబాబు
- తమ సుపరిపాలన, అభివృద్ధి పనులకే ఈ విజయం నిదర్శనమని వెల్లడి
- గొడ్డలి పార్టీ హింసా రాజకీయాలను ప్రజలు పూర్తిగా తిరస్కరించారని విమర్శ
- ఎన్నికలను అడ్డుకునేందుకు విపక్షం చేసిన కుట్రలను సుప్రీంకోర్టు తిప్పికొట్టిందన్న సీఎం
- తుపానుల సమయంలోనూ ప్రజాసేవకే ప్రాధాన్యమిచ్చామన్న చంద్రబాబు



✍ జయభేరి, విజయవాడ, నవంబర్ 9 :

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన అఖండ విజయం తమ సుపరిపాలనకు, అభివృద్ధికి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రతి పౌరుడికి భద్రత కల్పిస్తూ, భరోసా ఇస్తున్న తమ ప్రభుత్వానికే ప్రజలు మద్దతుగా నిలిచారని, రాజకీయ పార్టీకి ఇంతకంటే పెద్ద రివార్డు ఏముంటుందని ఆయన పేర్కొన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడిన చంద్రబాబు, స్థానిక ఎన్నికల ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజా తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మార్కాపురంలో 21కి 21, అనకాపల్లిలో 24కి 24 జెడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించారు. విశాఖ మేయర్ స్థానాన్ని 2.50 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో కట్టబెట్టారు. ప్రజల కోసం కష్టపడి పని చేస్తే వారు అండగా ఉంటారని ఈ ఫలితాలు నిరూపించాయి" అని అన్నారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల వల్లే ఈ విజయం సాధ్యమైందని చంద్రబాబు వివరించారు. "సీమ కరవుకు చెక్ పెట్టేలా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేశాం. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, మళ్లీ తొలిదశను ప్రారంభించి రైతుల కష్టాలు తీర్చింది మేమే. పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్లాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర ఆకాంక్షలకు రెక్కలు తొడిగాం.

...మిగతాది 3 లో

మిల్లర్ల నుంచే బియ్యం

- రూ.66కే కిలో బియ్యం , ధరల పెంపుపై సర్కార్ సీరియస్



✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో పెరుగుతున్న బియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. బియ్యం కొరత ఉందంటూ కొందరు వ్యాపారులు కృత్రిమంగా ధరలు పెంచుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. బియ్యం రకాలను బట్టి కిలో గరిష్ట విక్రయ ధరలను నిర్ణయించింది. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66.. ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం రూ.79కు మించి విక్రయించకూడదని స్పష్టం చేసింది. నిర్ణయించిన ధరలకు మించి అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. రాష్ట్రంలో బియ్యం నిల్వలు సరిపడా ఉన్నాయని..

...మిగతాది 2 లో



రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ

పట్టుబడ్డ కీసర ఎస్ఐ

- ఇప్పటికే ఇదే స్టేషన్‌కు చెందిన సీఐ, ఎస్ఐ రూ.5 లక్షల లంచం వ్యవహారంలో అరెస్ట్

✍ జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్‌లో మరో అవినీతి ఘటన వెలుగులోకి వచ్చింది.రెండు కేసుల్లో చార్జిషీట్లు త్వరగా దాఖలు చేసేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఎస్ఐ శ్రీనివాస్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఇటీవల ఇదే పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐ, మరో ఎస్ఐ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కి అరెస్ట్ కావడం.. ఆ సమయంలో స్థానికులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని బాణసంచా కాల్చి సంబరాలు చేసుకోవడం తెలిసిందే.

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

కొడంగల్‌కు కృష్ణమ్మ బాట!

ఈ ప్రాంతంలో వలసలు ఆగలేదని ముఖ్యమంత్రి అన్నారు. భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని పేర్కొన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని గత పదేళ్లుగా పక్కనపెట్టారని విమర్శించారు. కొడంగల్ ప్రాంతంలో భారీ పెట్టుబడులతో పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. పరిశ్రమల స్థాపన ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. రాజేంద్రనగర్ నుంచి చేవెళ్ల, షాబాద్, పరిగి, కొడంగల్ ప్రాంతాలకు రహదారుల అనుసంధానాన్ని మెరుగుపరుస్తామని వివరించారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి ఏర్పడుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. అందరం కలిసికట్టుగా ఈ పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. వచ్చే సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని ప్రకటించారు. ఒక సీజన్‌లో వరి సాగు తగ్గినా సన్నబియ్యం విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వద్ద తగిన నిల్వలు ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గంలో రహదారులు, సాగునీరు, విద్య, వ్యవసాయం, రవాణా, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ప్రాధాన్యత నిస్తూ 13 కీలక ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన చేశారు.

ప్రధాన అభివృద్ధి పనులు:

1. కొత్త్వాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు-2.
2. రూ.1,410 కోట్లతో 223 కొత్త బీటీ రహదారులు, అసంపూర్తి రోడ్ల పనులు.
3. రూ.2,100 కోట్లతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ రెండో దశ.
4. రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు.
5. రూ.123 కోట్లతో కొడంగల్ వ్యవసాయ కళాశాల.
6. రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్టాండ్లు.
7. రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్.
8. రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం.
9. రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు.
10. రూ.4.45 కోట్లతో తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధి.
11. రూ.5.10 కోట్లతో కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధి.
12. రూ.10 కోట్లతో హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో పర్యాటక హోటల్.
13. రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ.

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. పాలమూరు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

పట్టుబడ్డ కీసర ఎస్ఐ

ఆ ఘటన మరువకముందే తాజాగా మరో ఎస్ఐ ఏసీబీ వలలో చిక్కడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కీసర పోలీస్ స్టేషన్‌లో నమోదైన భూ మోసం, 498ఏ కేసుల్లో ఓ వ్యక్తి నిందితుడిగా ఉన్నాడు. ఈ 2 కేసులకు సంబంధించి త్వరగా చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆయన ఎస్ఐ శ్రీనివాస్‌ను కోరినట్లు తెలుస్తోంది. అయితే చార్జిషీట్ల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని ఎస్ఐ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లేదంటే చార్జిషీట్లు దాఖలు చేయడంలో జాప్యం జరుగుతుందని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో లంచం డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుపై స్పందించిన అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేశారు. సోమవారం కీసర పరిధిలోని శిల్పా లేఅవుట్ ప్రాంతంలో బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఎస్ఐ శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నగదును స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.

కీసర పోలీస్ స్టేషన్‌లో అవినీతి ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో ఇదే స్టేషన్‌కు చెందిన సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ కేసులో స్టేషన్ బెయిల్ విషయంలో సీఐ ఆంజనేయులు బాధితుడి నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత రూ.5 లక్షలను ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి ద్వారా తీసుకునేలా వ్యవహరించినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ సమాచారంతో డీఎస్పీ మజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. కీసర చెరువు వద్ద గణేశ్ నిమజ్జనం విధుల్లో ఉన్న ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి వద్ద నుంచి రూ.5 లక్షలు స్వీకరిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ సిబ్బందిని గమనించిన ఎస్ఐ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు.

అనంతరం కీసర పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించిన అధికారులు సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డిని అరెస్టు చేశారు. వారి ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టి లంచం వ్యవహారానికి సంబంధించిన వివరాలు సేకరించారు. సీఐ, ఎస్ఐ అరెస్ట్ విషయం తెలుసుకున్న కీసర, బోగారం ప్రాంతాలకు చెందిన కొందరు స్థానికులు అప్పట్లో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అధికారుల అరెస్టును స్వాగతిస్తూ బాణసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కొందరు నినాదాలు కూడా చేశారు. గతంలో తమ కేసుల విషయంలో సదరు అధికారులు ఇబ్బందులకు గురిచేశారని, లంచాల కోసం వేధించారని కొందరు స్థానికులు ఆరోపించారు. ఇప్పుడు అదే పోలీస్ స్టేషన్‌లో మరో ఎస్ఐ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో ఈ వరుస ఘటనలు మరోసారి చర్చకు వచ్చాయి. ఒకే పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐ, ఇద్దరు ఎస్ఐలు వేర్వేరు లంచం ఆరోపణల కేసుల్లో ఏసీబీకి పట్టుబడటం పోలీస్ శాఖలో అంతర్గత పర్యవేక్షణ, అవినీతి నిరోధక చర్యలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ తాజా కేసులో ఏసీబీ విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మిల్లర్ల నుంచే బియ్యం

కొరత ఏర్పడిందంటూ వస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని పౌరసరఫరాల శాఖ ప్రజలకు సూచించింది. కొందరు దళారులు బియ్యం కొరత వస్తుందనే భయాన్ని సృష్టించి.. మార్కెట్‌లో ధరలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ పరిస్థితుల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడకుండా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టింది. పౌరసరఫరాల శాఖ నిర్ణయించిన ధరల ప్రకారం.. బీపీటీ, కేఎన్ఎం కిలో గరిష్ట ధర రూ.66గా నిర్ణయించారు. ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా కిలో గరిష్ట ధర రూ.74గా పేర్కొన్నారు. హెచ్ఎంటీ, జేఎస్ఆర్ కిలో గరిష్ట ధర రూ.79గా నిర్ణయించారు. ఈ ధరల పరిమితులను వ్యాపారులు తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరలకు మించి విక్రయాలు జరిపినా.. ఎమ్మార్పీని మార్చి అధిక ధరలకు అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బియ్యం బస్తాలపై ముద్రించిన ఎమ్మార్పీ వివరాలు స్పష్టంగా ఉండాలని సూచించారు. బియ్యం విక్రయాల్లో జరుగుతున్న అక్రమాలపై పౌరసరఫరాల శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. 25 కిలోల బస్తాపై 26 కిలోల స్టిక్కర్ వేసి విక్రయించడం.. అసలు ఎమ్మార్పీపై అధిక ధరలతో నకిలీ స్టిక్కర్లు అతికించడం వంటి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేసింది. పదే పదే నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై పీడీ యాక్ట్ ప్రయోగించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు. రిటైల్ వ్యాపారులకు బియ్యం సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం మరో కీలక వెసులుబాటు కల్పించింది. ఇకపై రిటైలర్లు హోల్‌సేల్ వ్యాపారులపై ఆధారపడాల్సిన అవసరం లేదని.. నేరుగా రైస్ మిల్లర్ల నుంచే బియ్యం తెప్పించుకోవచ్చని పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. ఎక్కడైనా బియ్యం స్టాక్ అందుబాటులో లేకపోతే సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారులను సంప్రదించాలని సూచించింది. బియ్యం ధరల నియంత్రణ కోసం క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ శాఖలు సంయుక్తంగా రిటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాయి. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

బియ్యం ధరల విషయంలో వినియోగదారులు మోసపోకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. నిర్ణయించిన గరిష్ట ధరలకు మించి ఎవరైనా బియ్యం విక్రయిస్తే పౌరసరఫరాల శాఖకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచే ప్రయత్నాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు స్పష్టం చేశారు.

వోట్ జీరో.. ఫండ్స్ హీరో



దేశంలో ఉన్న 2,074 రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీల ఆర్థిక లెక్కలపై ఆ రిపోర్ట్. చదివాక ఒకటే ఫీలింగ్ వస్తుంది. ఇది పార్టీల జాబితా కాదు, ఘోస్ట్‌ల జాబితా. రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీ అంటే ఎన్నికల సంఘం దగ్గర పేరు నమోదు చేసుకున్న పార్టీ. కానీ రాష్ట్ర పార్టీ హోదా గానీ, జాతీయ పార్టీ హోదా గానీ రాలేదు. ఓట్ల శాతం సరిపోక, సీట్లు రాక, లేదా రిజిస్టర్ అయ్యాక అసలు ఎన్నికల్లోనే దిగక. వీటికి సొంత గుర్తు ఉండదు. ఫ్రీ సింబల్స్ లిస్ట్‌లోంచి ఎంచుకోవాలి. ఉచిత ఓటర్ల జాబితా కాపీలు ఉండవు. దూరదర్శన్‌లో ఫ్రీ టైమ్ ఉండదు. పార్టీ ఆఫీస్‌కి సబ్సిడీ భూమి ఉండదు. ఇన్ని లేకపోయినా ఒక పవర్‌ఫుల్ బెనిఫిట్ మాత్రం ఉంది. ఆదాయపు పన్ను మినహాయింపు. కండిషన్స్ చాలా చిన్నవి. ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్ వేయాలి, రూ20,000 దాటిన విరాళాల వివరాలు ఏటా ఎన్నికల సంఘానికి ఇవ్వాలి. అంతే. ఇంకా ట్విస్ట్ ఏంటంటే, రూ20,000 దాటిన విరాళమే రాలేదని చెప్పినా మినహాయింపు పోదు. ఒకసారి రిజిస్టర్ అయ్యావంటే ఆ కవచం నీ దగ్గరే ఉంటుందిభారత ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలు సమర్పించిన తాజా విరాళాల నివేదికల ప్రకారం జాతీయ రాజకీయాల్లో ఆసక్తికరమైన గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. రూ. 20,000 అంతకంటే ఎక్కువ మొత్తం ఉన్న విరాళాల సేకరణలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వెనుకబడిపోయింది. 202425 ఆర్థిక సంవత్సరంలో పొందిన రూ. 517.39 కోట్ల విరాళాలను పొందిన కాంగ్రెస్ 202526 నాటికి ఈ విరాళాల మొత్తం ఏకంగా 75 శాతం పడిపోయి రూ. 130.69 కోట్లకు పరిమితమైంది. దశాబ్ద కాలంలో కాంగ్రెస్ పార్టీ పొందిన విరాళాల్లో ఇది అతి తక్కువ. కాంగ్రెస్‌కు విరాళాలు ఇంత దారుణంగా పడిపోవడానికి ప్రధాన కారణం ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి వచ్చిన నిధులు గణనీయంగా తగ్గడమే. గతంలో ఈ ట్రస్ట్ నుంచి కాంగ్రెస్‌కు రూ. 216.34 కోట్ల వరకు విరాళాలు రాగా, ఈసారి అవి దాదాపు 88 శాతం పడిపోయి కేవలం రూ. 25 కోట్లకు చేరుకున్నాయి. 202526 నివేదికలో కాంగ్రెస్ పార్టీకి లభించిన ప్రధాన విరాళాల్లో స్టార్ సిమెంట్స్ రూ. 5 కోట్లు, సజ్జన్ భజంకా రూ. 4 కోట్లు, ప్రేమ్ కుమార్ భజంకా రూ. 2 కోట్లు ప్రముఖంగా ఉన్నాయి. అంతకు మించి ఎవరూ విరాళాలివ్వడం లేదు. అధికార భారతీయ జనతా పార్టీతో పోలిస్తే కాంగ్రెస్ ఆదాయం చానా దూరంలో ఉంది.

202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీజేపీ ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదిక ప్రకారం.. రూ. 20,000 కంటే ఎక్కువ ఉన్న విరాళాల రూపంలో ఆ పార్టీ ఏకంగా రూ. 6,074.02 కోట్లను రాబట్టింది. ఇది కాంగ్రెస్ పార్టీ సేకరించిన విరాళాల మొత్తానికి దాదాపు 12 రెట్లు. బిజెపికి చెందిన 2025 26 విరాళాల నివేదిక ఇంకా ఇసిఐ వెబ్‌సైట్‌లో విడుదల కావాల్సి ఉంది. అయితే, ఈ రూ. 20 వేల పైబడిన విరాళాల వివరాలు మాత్రమే కాంగ్రెస్ పార్టీ మొత్తం ఆదాయాన్ని ప్రతిబింబించవు. చిన్న మొత్తాల విరాళాలు, సభ్యత్వ రుసుములు, కూపన్ల విక్రయం, బ్యాంక్ డిపాజిట్లపై వచ్చే వడ్డీల ద్వారా కాంగ్రెస్ అదనపు ఆదాయాన్ని పొందుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో కూపన్ నిధుల సేకరణ ద్వారానే కాంగ్రెస్‌కు రూ. 350 కోట్లకు పైగా సమకూరాయి. ఈసిఐ ద్వారా పూర్తి ఆడిట్ ఖాతాల నివేదిక వెలువడిన తర్వాతే రెండు ప్రధాన జాతీయ పార్టీల సమగ్ర ఆర్థిక స్థితిగతులపై పూర్తి స్పష్టత రానుంది. తెలంగాణలో 104 ఉన్నాయి. వాటిలో 78 పార్టీల ఆడిట్ రిపోర్ట్, విరాళాల రిపోర్ట్, రెండూ సీఈవో వెబ్‌సైట్‌లో లేవు. ప్రతి నాలుగు పార్టీల్లో మూడు. ఆంధ్రప్రదేశ్‌లో 65 పార్టీలు ఉంటే 45 పార్టీలకు ఒక్క పేపర్ కూడా లేదు. రెండు రాష్ట్రాలనూ కలిపితే 169 పార్టీల్లో 123 ఘోస్ట్‌లు. అంటే 72.8%. రెండు రిపోర్టులూ పక్కాగా పెట్టిన పార్టీలు తెలంగాణలో 17, ఏపీలో 14. దేశ సగటు 22.2% ఉంటే తెలంగాణ 16.3% దగ్గర ఆగిపోయింది. ఏపీ 21.5%. దేశం మొత్తం చూస్తే 2,074లో 1,330 పార్టీల లెక్కలు పబ్లిక్‌కి కనిపించవు, దాదాపు 64%. యూపీలో 530 పార్టీల్లో 304 పార్టీలది ఇదే కథ. ఉత్తరాఖండ్‌లో 26 పార్టీల్లో ఒక్కదానిది కూడా లేదు, జీరో. పుదుచ్చేరి, సిక్కిం, త్రిపుర, చండీగఢ్ కూడా అంతే.

తెలంగాణలో లెక్కలు చెప్పిన 26 పార్టీల మొత్తం ఆదాయం కలిపి రూ18.98 లక్షలు. ఏపీలో 20 పార్టీల ఆదాయం రూ 70.8 లక్షలు. అదే ఏడాది గుజరాత్‌లోని 29 పార్టీలు రూ510 కోట్లు చూపించాయి. రూ1 కోటి దాటి ఆదాయం చూపిన 49 పార్టీల టాప్ లిస్ట్‌లో తెలంగాణ, ఏపీ పార్టీలు ఒక్కటి కూడా లేవు. కాబట్టి మన దగ్గర సమస్య భారీ మొత్తాలు కాదు. లెక్కలే లేకపోవడం. రిపోర్ట్ మన పార్టీలను ఏ తప్పూ చేశాయని అనలేదు, వెరిఫై చేయడానికి సమాచారమే లేదని మాత్రమే చెప్పింది. ఇక్కడ లెక్కలు ఇంకా విచిత్రంగా ఉన్నాయి. ఒక పార్టీ నాకు మొత్తం రూ100 విరాళంగా వచ్చింది అని చెప్పి, అందులో రూ200 పెద్ద విరాళాలు అని చూపిస్తే మ్యాథ్స్ కూడా ఏడుస్తుంది. రిపోర్ట్‌లో ఇలాంటి 14 పార్టీలు ఉన్నాయి. అందులో రెండు తెలంగాణవి. మజ్లిస్ బచావో తహ్రీక్ ఆదాయం 0, మొత్తం విరాళాలు 0. కానీ కాంట్రిబ్యూషన్ రిపోర్ట్‌లో రూ1.29 లక్షల పెద్ద విరాళాలు ఉన్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 7 సీట్లలో పోటీ చేసి 49,423 ఓట్లు తెచ్చుకుంది. విశ్వ భారత్ పార్టీ ఆదాయం రూ900, మొత్తం విరాళాలు రూ200, పెద్ద విరాళాలు రూ 30,000. ఒక సీటులో పోటీ చేస్తే వచ్చిన ఓట్లు 55. యాభై ఐదు. ఇది టైపో కాదు. తెలంగాణ మొత్తం చూసినా అదే సీన్. రూ20,000 పైబడిన విరాళాలు రూ 84.8 లక్షలు, మొత్తం విరాళాలు రూ12.67 లక్షలు. ఏపీలో రూ 1.07 కోట్లు వర్సెస్ రూ 70.1 లక్షలు. పైగా ఖర్చు రూ 78.2 లక్షలు, ఆదాయం రూ70.8 లక్షలే. అంటే ఆడిట్ ఫైల్ ఒక కథ చెప్తోంది, కాంట్రిబ్యూషన్ రిపోర్ట్ మరో కథ చెప్తోంది. ఈ రెండు ఫైళ్లు ఒకదానితో ఒకటి మాట్లాడుకోలేదు.

సరే, తెలుగు రాష్ట్రాలు చిన్న లెవల్. అసలు సినిమా గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్‌లో ఉంది.. జన్ సురాజ్ పార్టీ FY 202425లో రూ101 కోట్ల ఆదాయం చూపింది. ఖర్చు రూ9.2 కోట్లు మాత్రమే. బిహార్ 2025లో 238 సీట్లలో పోటీ చేసి 16,77,583 ఓట్లు తెచ్చుకుంది. కానీ గెలిచిన సీట్లు జీరో. తర్వాత 2026లో బాంకీపూర్ ఉపఎన్నికలో 64,151 ఓట్లతో ఒక సీటు గెలిచింది. ఆ పార్టీ విరాళాల్లో వేదాస్ వెంచర్స్ ఒక్కటే రూ85 కోట్లు 85 లావాదేవీల్లో ఇచ్చింది. ప్రశాంత్ కిషోర్ రూ10 కోట్లు 10 విరాళాల్లో ఇచ్చారని రిపోర్ట్ చెప్పింది. డబ్బు ఉంది, పోటీ ఉంది, ఓట్లు ఉన్నాయి, గ్రౌండ్ ఉంది. అక్కడ లెక్కలు పెట్టారు, ఫైల్ చేశారు, పబ్లిక్‌కి కనిపిస్తున్నాయి. ఇక తమిళగ వెట్రి కళగం సెప్టెంబర్ 2024లో రిజిస్టర్. FY 202425లో డిక్లేర్ చేసిన ఆదాయం రూ7.57 లక్షలు. ఆ తర్వాత తమిళనాడు 2026 ఎన్నికల్లో 233 సీట్లలో పోటీ చేసి 1.72 కోట్ల ఓట్లు తెచ్చుకుంది. తమిళనాడులో 108, పుదుచ్చేరిలో 2, మొత్తం 110 సీట్లు. అంటే రూ7.57 లక్షలతో 110 సీట్లు. పక్కన న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ రూ291 కోట్లతో 1,426 ఓట్లు. ఇప్పుడు చెప్పు, పొలిటికల్ పవర్ డబ్బుతో వస్తుందా, జనంతో వస్తుందా? పీఎంకే 4 సీట్లు, జనసత్తా దళ్ లోక్‌తాంత్రిక్ 2 సీట్లు, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) 1 లోక్‌సభ సీటు గెలిచాయి. చిన్న పార్టీలు ఓట్లతో సీట్లుగా మారగలవని ఇవే ప్రూఫ్. ఎన్నికల సంఘం బ్లైండ్ కాదు. 2025 ఆగస్టు 9న 334, సెప్టెంబర్ 18న 474, మొత్తం 808 పార్టీలు ఆరేళ్లు పోటీ చేయలేదని డీలిస్ట్ చేసింది. ఇంకో 359 పార్టీలపై ఆడిట్ ఖాతాలు ఇవ్వలేదని చర్యలు మొదలుపెట్టింది. 2022లో 537 పార్టీలను తొలగించింది. 2026 మార్చిలో రూల్ కూడా మార్చింది.

- కోచింగ్ లేదు.. ఆన్‌లైన్‌లోనే చదువు!
- రోజుకు 8 నుంచి 10 గంటల చదువు.. పక్కా టైమ్‌టేబుల్!

మొబైల్‌కు దూరంగా..

✍ జయభేరి, వరంగల్ :



తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌కు చెందిన ఎట్టబోయిన సాయి శివాని (Ettaboyina Sai Shivani) UPSC సివిల్ సర్వీసెస్ పరీక్ష 2024లో అఖిల భారత స్థాయిలో 11వ ర్యాంక్ సాధించింది. చిన్నప్పటి నుంచి ఉన్నత లక్ష్యాలను పెట్టుకున్న ఆమె, సివిల్ సర్వీసెస్‌లో స్థానం సంపాదించాలనే ఆశయంతో కష్టపడి చదివింది. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు కాగా, తల్లి గృహిణి. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారం తన విజయానికి ఎంతో తోడ్పడ్డాయని శివాని చెబుతోంది. యూపీఎస్సీ ప్రయాణంలో శివానికి మొదటి ప్రయత్నం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ప్రిలిమ్స్ పరీక్షలోనే ఆమెకు నిరాశ ఎదురైంది. అయితే ఆ అపజయాన్ని చూసి వెనక్కి తగ్గలేదు. ఎక్కడ తప్పు జరిగిందో విశ్లేషించుకుంది. మొదటి ప్రయత్నంలో సిలబస్ పూర్తిచేయడంపైనే ఎక్కువ దృష్టి పెట్టడంతో సమాధానాలు రాసే ప్రాక్టీస్‌కు తగినంత సమయం కేటాయించలేకపోయానని గుర్తించింది. దీంతో రెండో ప్రయత్నంలో తన వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంది. ముఖ్యంగా మెయిన్స్ పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి అవసరమైన ఆన్సర్ రైటింగ్ ప్రాక్టీస్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. సమాధానాలను ఎలా ప్రారంభించాలి? ఇచ్చిన ప్రశ్నకు అనుగుణంగా ముఖ్యమైన అంశాలను ఎలా వివరించాలి? తక్కువ సమయంలో సమర్థవంతంగా ఎలా రాయాలి? అనే విషయాలపై సాధన చేసింది. తన సమాధానాల్లోని లోపాలను గుర్తిస్తూ వాటిని మెరుగుపరుచుకుంది. ఈ మార్పు ఆమె విజయానికి ఎంతో ఉపయోగపడింది. సాధారణంగా యూపీఎస్సీకి సిద్ధమయ్యే చాలామంది అభ్యర్థులు ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో చేరుతుంటారు. కానీ సాయి శివాని మాత్రం ఎలాంటి కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోనూ శిక్షణ తీసుకోలేదు. పూర్తిగా స్వీయ అధ్యయనంతోనే పరీక్షకు సిద్ధమైంది. ఇందుకోసం యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్న వివిధ విద్యా సంబంధిత ఛానళ్లను ఉపయోగించుకుంది. నిపుణులు చెప్పే పాఠాలను వింటూ ముఖ్యమైన అంశాలను నోట్స్ రూపంలో రాసుకునేది. అంతేకాకుండా ఆన్‌లైన్ టెస్ట్ సిరీస్‌లో కూడా చేరింది. వీటి ద్వారా పరీక్షల్లో సమయాన్ని ఎలా నిర్వహించుకోవాలి? ప్రశ్నలను ఎలా అర్థం చేసుకోవాలి? సరైన సమాధానాలను ఎలా రాయాలి? అనే విషయాలపై మంచి అవగాహన పెంచుకుంది. సాయి శివాని తన విజయానికి సమయపాలన చాలా ముఖ్యమని చెబుతోంది. ప్రతిరోజూ 8 నుంచి 10 గంటల పాటు చదువుకునేది. ఉదయాన్నే నిద్రలేచి చదువు ప్రారంభించేది. రోజులో రెండు నుంచి మూడు సబ్జెక్టులను చదివేందుకు సమయం కేటాయించేది. రాత్రి సమయంలో ఆ రోజు చదివిన అంశాలను మరోసారి రివిజన్ చేసుకునేది. తనకు అనుకూలంగా ప్రత్యేక టైమ్‌టేబుల్ తయారు చేసుకుని దానిని కచ్చితంగా పాటించేది. చదివిన అంశాలను మళ్లీ మళ్లీ గుర్తుచేసుకోవడం, నిరంతరం పరీక్షలు రాయడం, సమాధానాలు రాసే వేగాన్ని పెంచుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చింది.


మొబైల్ ఫోన్‌కు దూరంగా.. సోషల్ మీడియాకు నో!

శివాని విజయ ప్రయాణంలో అందరినీ ఆకట్టుకునే మరో విషయం ఆమె మొబైల్ ఫోన్ వినియోగం విషయంలో తీసుకున్న నిర్ణయం. చదువుతున్న సమయంలో ఫోన్ వల్ల ఏకాగ్రత దెబ్బతింటుందని ఆమె భావించింది. ముఖ్యంగా సోషల్ మీడియా, వాట్సాప్ వంటి యాప్‌ల కారణంగా సమయం వృథా అవుతుందని గుర్తించింది. అందుకే UPSC ప్రిపరేషన్ సమయంలో వ్యక్తిగత మొబైల్ ఫోన్‌ను ఉపయోగించకూడదని నిర్ణయించుకుంది. చదువుపై పూర్తి దృష్టి పెట్టేందుకు సోషల్ మీడియాకు దూరంగా ఉండేది. అవసరమైనప్పుడు తల్లిదండ్రుల ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులతో మాట్లాడేది. ఇలా అనవసరమైన దృష్టి మళ్లింపులను తగ్గించుకుని తన లక్ష్యంపై దృష్టి సారించింది. యూపీఎస్సీ మెయిన్స్‌లో ఆప్షనల్ సబ్జెక్ట్ ఎంపిక కూడా కీలకమైన అంశం. సాయి శివాని ఆంత్రోపాలజీ (Anthropology)ని తన ఆప్షనల్ సబ్జెక్ట్‌గా ఎంచుకుంది. ఈ సబ్జెక్టుపై ఆసక్తి ఉండటంతో పాటు, సిలబస్ కూడా తనకు అనుకూలంగా అనిపించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఆసక్తి ఉన్న సబ్జెక్టును ఎంచుకోవడం వల్ల దానిపై ఎక్కువ సమయం కేటాయించి, లోతుగా అధ్యయనం చేయగలిగింది. UPSC పర్సనాలిటీ టెస్ట్ విషయంలోనూ శివాని ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఇంటర్వ్యూకు ముందు మాక్ ఇంటర్వ్యూలకు హాజరైంది. స్నేహితులతో కలిసి గ్రూప్ డిస్కషన్లలో పాల్గొంది. దీనివల్ల ప్రశ్నలకు ధైర్యంగా సమాధానాలు చెప్పే సామర్థ్యం పెరిగింది. ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు తన వ్యక్తిగత నేపథ్యం, సమకాలీన అంశాలపై ప్రశ్నలు అడిగారని, వాటికి ఆత్మవిశ్వాసంతో సమాధానాలు ఇచ్చానని ఆమె తెలిపింది. ఇంటర్వ్యూ అనుభవం కూడా చాలా బాగుందని చెప్పింది. యూపీఎస్సీలో అద్భుతమైన ర్యాంక్ సాధించిన తర్వాత తన భవిష్యత్తు లక్ష్యం గురించి కూడా శివాని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించింది. ప్రజలకు సేవ చేయాలని, ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాల్లో మంచి మార్పులు తీసుకురావాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమవుతున్న యువతకు శివాని కొన్ని ముఖ్యమైన సూచనలు చేసింది. కష్టపడి చదవాలని, తమపై తమకు నమ్మకం ఉండాలని, సమయాన్ని సరిగ్గా వినియోగించుకోవాలని సూచించింది. ముఖ్యంగా సోషల్ మీడియా వంటి వాటికి దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని చెప్పింది. అపజయాలు ఎదురైనా నిరుత్సాహపడకుండా, వాటి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని సూచించింది. మొదటి ప్రయత్నంలో ప్రిలిమ్స్‌లోనే విఫలమైన సాయి శివాని.. రెండో ప్రయత్నంలోనే ఆల్ ఇండియా 11వ ర్యాంక్ సాధించడం సాధారణ విషయం కాదు. కోచింగ్ లేకుండా, ఆన్‌లైన్ వనరులను సమర్థంగా ఉపయోగించుకుంటూ, రోజుకు 8 నుంచి 10 గంటలు క్రమశిక్షణతో చదువుతూ ఆమె ఈ విజయాన్ని అందుకుంది.

'దేశద్రోహి' ఆరోపణలపై రాహుల్ ఫైర్!

- తనతో బహిరంగ చర్చకు రావాలని ప్రధాని మోదీకి సవాల్

✍ జయభేరి, న్యూఢిల్లీ:



భారత ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి వేడుకల్లో తనపై, ప్రతిపక్షాలపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. తమపై చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని మోదీకి సోమవారం మరోసారి సవాల్ విసిరారు. ప్రధానికి గతంలో తాను విసిరిన సవాల్‌కు ఇంకా అలానే ఉందన్నారు. దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను భద్రతా సిబ్బంది నమ్మడం లేదని వారి ముఖ కవళికలు స్పష్టం చేశాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు రాహుల్ గాంధీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. కాగా, ఆదివారం ప్రధాని మోదీ బస్తర్‌లో భద్రతా సిబ్బందితో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రతిపక్షాలు దేశద్రోహులు, విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారాయంటూ ఆరోపించారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యలపై రాహుల్ సోమవారం ఫైర్ అయ్యారు.

దేశద్రోహులు ఎవరు? విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నవారు ఎవరు? అనే విషయంపై ప్రధాని మోదీ తనతో చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ఈ విషయంపై ఏ సమయంలోనైనా, ఏ వేదికపైనైనా మోదీతో చర్చకు తాను చర్చకు సిద్ధమేనని అన్నారు. తనతో చర్చ తర్వాత మోదీ ఒక్క జవాన్ ముందు కూడా నిలబడలేరని ఆరోపించారు. దీపావళి సందర్భంగా చేసిన ప్రసంగంలో ప్రధాని మోదీ చెప్పిన అబద్ధాలను జవాన్లు నమ్మలేదని పేర్కొన్నారు.

దేశంలో నక్సలిజం ముప్పు ఇంకా తొలగిపోలేదని, 'దిమాగీ నక్సల్స్' పలు సంస్థలు, రాజకీయ పార్టీలలోకి చొరబడి రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. బస్తర్‌లో భద్రతా సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్న ప్రధాని మోదీ జవాన్లనుద్దేశించి ప్రసంగించారు. ఈ క్రమంలో విపక్షాలపై మండిపడ్డారు. అడవుల నుంచి సాయుధ నక్సలైట్లను ఏరివేసినప్పటికీ, దిమాగీ నక్సల్స్ దేశానికి సవాల్‌గా నిలుస్తూనే ఉన్నారని అన్నారు. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే భద్రతా సిబ్బందికి గత ప్రభుత్వాలు స్వేచ్ఛను పరిమితం చేశాయని విమర్శించారు. తమ ప్రభుత్వం జవాన్లు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని కల్పించిందని పేర్కొన్నారు.

"దేశంలో నక్సలైట్లు అంతమయ్యారు. కానీ నక్సల్స్ ముప్పు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. అడవుల్లో సాయుధ నక్సలైట్లు తుడిచిపెట్టుకుపోయినప్పటికీ, దిమాగీ నక్సల్స్ అనేక సంస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. నేటికీ వారు దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఈ దిమాగీ నక్సల్స్ అనేక రాజకీయ పార్టీల్లోకి, వివిధ సంస్థల్లోకి చొరబడ్డారు. మనం వారిని గుర్తించి ఓడించి, దేశ భద్రతను కాపాడుకోవాలి. గత ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో నక్సల్స్‌తో పోరాడుతున్న భద్రతా సిబ్బంది చేతులను కట్టేశాయి. నక్సలైట్లు దాడులకు పాల్పడినప్పుడు వారికి ధీటుగా సమాధానమిచ్చే స్వేచ్ఛ భద్రతా దళాలకు ఉండేది కాదు. మేము భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం" అని మోదీ వ్యాఖ్యానించారు.

గతంలోనూ మోదీ చేసిన ఇలాంటి ఆరోపణలపై రాహుల్ గాంధీ స్పందించారు. విదేశీ సాయంతోనే మోదీ ప్రధాని అయ్యారని ఆరోపించారు. ఇప్పటికీ విదేశీ సాయంతోనే ఆ పదవిలో కొనసాగుతున్నారని ధ్వజమెత్తారు. అలాగే భారత ఆర్థిక వ్యవస్థను కూడా విదేశీ శక్తులే నియంత్రిస్తున్నాయని విమర్శించారు. విదేశీ సోషల్ మీడియా కూడా మోదీకి పూర్తిగా మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రధానితో తాను బహిరంగ చర్చకు కూడా సిద్ధమేనని సవాల్ విసిరారు. దేశ ప్రజలకు మోదీ అబద్ధాలు చెప్పడం ఆపాలని దుయ్యబట్టారు. మోదీకి ధైర్యం ఉంటే ఏ వేదికపై అయినా, ఏ సమయంలో అయినా తనతో చర్చకు రావాలని అన్నారు. తనతో చర్చకు మోదీ భయపడుతున్నారని, అంతటి సాహసం ఆయన చేయరని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

మొదటిపేజీ తరువాయి

వాళ్లు నేరాలను నమ్ముకున్నారు

ప్రజల కోరిక మేరకు మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశాం" అని ఆయన గుర్తుచేశారు. ప్రతిపక్ష వైసీపీపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "మేం ప్రజల్ని, వారి నమ్మకాన్ని విశ్వసిస్తే, గొడ్డలి పార్టీ నేరాలను, ఘోరాలనే నమ్ముకుంది. ఎన్నికల్లో హింసను ప్రేరేపించింది. తీవ్రవాదుల తరహాలో హిట్ అండ్ రన్ రాజకీయాలు చేసింది. కానీ, హింసా రాజకీయాలను ప్రజలు ఎన్నడూ ఆమోదించరు. ఇదేమీ రాతియుగం కాదు.. రౌడీయిజం, డ్రామాలతో ప్రజా తీర్పును మార్చలేరని గొడ్డలి పార్టీ గుర్తించుకోవాలి" అని హెచ్చరించారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ అన్ని విధాలా ప్రయత్నించిందని చంద్రబాబు ఆరోపించారు. "బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వంటి అంశాలపై పిటిషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని చూశారు. కానీ, సుప్రీంకోర్టు వారి ప్రయత్నాలకు చెక్ పెట్టింది. 'వైసీపీ ట్రాప్‌లో పడబోం' అని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించే దుస్థితికి ఆ పార్టీ దిగజారింది" అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెండు తుపాన్లు వస్తే ప్రజలను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం నిమగ్నమైందని, కానీ ప్రతిపక్షం కనీసం స్పందించలేదని, వారికి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని చంద్రబాబు విమర్శించారు. తాము ఎన్నికల కన్నా ప్రజా సమస్యలకే అధిక ప్రాధాన్యం ఇచ్చామని, దీనిని ప్రజలు అర్థం చేసుకుని తమకు మద్దతుగా నిలిచారని ఆయన పేర్కొన్నారు.

యాదాద్రిలో శ్రీసత్యనారాయణ స్వామి వ్రత సమయాల్లో మార్పులు



✍ జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 09 :

కార్తీకమాసం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శ్రీసత్యనారాయణ స్వామి వ్రత సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ కార్తీకమాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా వ్రత సమయాల్లో మార్పులు చేసినట్లు తెలిపారు. ఉదయం 7:00 గంటల నుండి 8:00 గంటల వరకు మొదటి బ్యాచ్,ఉదయం 9:00 నుండి 10:00 గంటల వరకు రెండో బ్యాచ్, ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మూడో బ్యాచ్, మధ్యాహ్నం 1:00 నుండి 2:00 గంటల వరకు నాలుగో బ్యాచ్, మధ్యాహ్నం 3:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఐదో బ్యాచ్, సాయంత్రం 5:00 నుండి 6:00 గంటల వరకు ఆరో బ్యాచ్‌కు వ్రతంలో పాల్గొనేలా మార్పులు చేసినట్లు తెలిపారు. వ్రత సమయాల్లో మార్పులతో భక్తులకు మరింత సులభతరంగా, క్రమబద్ధంగా వ్రతాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. భక్తులు నిర్ణీత సమయాల్లో వచ్చి శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజలు జరిపించుకోవాలని సూచించారు. స్వామి వారి అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో నాలుగు బ్యాచ్‌ల్లో వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్ ఉదయం 9 గంటలకు, రెండో బ్యాచ్ ఉదయం 11 గంటలకు, మూడో బ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు, నాలుగో బ్యాచ్ సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మరిన్ని బ్యాచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో లైంగిక వేధింపు ఘటన

- బీసీపై మహిళా ప్రొఫెసర్ సంచలన ఆరోపణలు,
- అర్ధరాత్రి వాట్సాప్ కాల్స్తో వేధింపులు..
- మానవ హక్కుల కమిషన్ను ఆశ్రయించిన బాధితురాలు

✍ జయభేరి, హైదరాబాద్ :

రాజేంద్రనగర్లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపుల ఆరోపణలు కలకలం రేపాయి. యూనివర్సిటీ వీసీ ఫ్ జానయ్య తనను వ్యక్తిగతంగా, అసభ్యకరమైన వ్యాఖ్యలతో వేధించే వారని మహిళా ప్రొఫెసర్ తేజస్విని సంచలన ఆరోపణలు చేశారు. కార్యాలయంలోకి పిలిచే ముందు సెల్ఫోన్లు బయట పెట్టించి, శరీర భాగాల గురించి అభ్యంతరకరంగా మాట్లాడేవారని ఆమె ఆరోపించారు. అర్ధరాత్రి వేళల్లో సైతం వాట్సాప్ కాల్స్ చేసి మానసికంగా వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తి నుంచి ఇలాంటి వేధింపులు ఎదురవుతున్నా పలుమార్లు మౌనంగా భరించానని, చివరకు వేధింపులు భరించలేక పోలీసులను ఆశ్రయించినా స్పందన లేకపోవడంతో మానవ హక్కుల కమిషన్ను ఆశ్రయించారు.

సామాజిక అంశాలపై విస్తృతంగా చర్చ

- హైదరాబాద్ యూత్ అసెంబ్లీ (HYA)-XVI సీజన్ ఫేజ్-I అసెంబ్లీ విజయవంతం
- నవజాత శిశువు సంరక్షణకు అవసరమైన వస్తువులు ఈ కిట్

✍ జయభేరి, హైదరాబాద్ :





సామాజిక సమస్యలపై యువత ఆలోచనలను కార్యాచరణగా మలిచే లక్ష్యంతో నిర్వహించిన హైదరాబాద్ యూత్ అసెంబ్లీ (HYA)XVI సీజన్ ఫేజ్I అసెంబ్లీ విజయవంతంగా జరిగింది. హైదరాబాద్‌లోని 35కు పైగా కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ అసెంబ్లీలో పాల్గొని, సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలపై తమ అభిప్రాయాలను, ఆలోచనలను మరియు పరిష్కార ప్రతిపాదనలను సభలో పొందుపరిచారు. UN Sustainable Development Goals (UNSDGs) ఆధారంగా సాగిన ఈ చర్చలలో విద్యార్థులు వివిధ సామాజిక అంశాలపై విస్తృతంగా చర్చించి, సమస్యల మూలాలను విశ్లేషించడంతో పాటు ఆచరణకు సాధ్యమైన పరిష్కారాలపై తమ ప్రతిపాదనలను వివరించారు.



తల్లుల సంరక్షణ కోసం HYA – ప్రాజెక్ట్ నవజీవం

ప్రసవం తర్వాత మహిళలకు అవసరమైన సంరక్షణ అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్ యూత్ అసెంబ్లీ (HYA) - XVI ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ నవజీవం' అనే ప్రత్యేక సేవా ప్రాజెక్టును చేపట్టనున్నారు. హైదరాబాద్ యూత్ అసెంబ్లీ అనేది యువతను సామాజిక సమస్యలపై ఆలోచించేలా ప్రోత్సహిస్తూ, వారి ఆలోచనలను ఆచరణాత్మక సామాజిక ప్రాజెక్టులుగా మార్చే ఒక యువజన వేదిక. UN Sustainable Development Goals (SDGs) లక్ష్యాలకు అనుగుణంగా విద్య, పేదరిక నిర్మూలన, వంటి అంశాలపై యువత పనిచేసేలా HYA ప్రోత్సహిస్తుంది. ఈ నేపథ్యంలో HYAXVIలోని Gender Equality విభాగం ద్వారా ప్రాజెక్ట్ నవజీవంను చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇటీవల ప్రసవించిన తల్లులకు పోస్ట్‌పార్టమ్ మెటర్నిటీ కిట్లను అందించనున్నారు. ప్రసవం తర్వాత తల్లికి అవసరమైన ముఖ్యమైన వస్తువులు, పరిశుభ్రతకు సంబంధించిన సామగ్రి, నవజాత శిశువు సంరక్షణకు అవసరమైన వస్తువులు ఈ కిట్‌లో ఉంటాయి. ప్రసవం తర్వాత సరైన సంరక్షణ లేకపోవడం వల్ల తల్లులు, శిశువులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని నిర్వహించిన సర్వేలో గుర్తించారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని తేలింది. ప్రాజెక్ట్ నవజీవం ద్వారా ప్రతి తల్లికి సురక్షితమైన ప్రసవానంతర జీవితాన్ని అందించాలని, తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో HYAXVI ఒక అడుగు ముందుకు వేస్తోంది. యువత ఆలోచనలు, భాగస్వామ్యం, కార్యాచరణ ద్వారా సమాజంలో సానుకూల మార్పును తీసుకురావచ్చని ఈ ప్రాజెక్టు చాటిచెప్పనుంది.

బీసీల రాజ్యాధికారానికై ఒంటరి పోరు

- రెడ్లు, వెలమల మోసాలను తిప్పికొట్టాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న

✍ జయభేరి, యాదగిరిగుట్ట :



తెలంగాణ రాష్ట్రంలోని బీసీల రాజ్యాధికారం కోసం ఒంటరి పోరు చేస్తున్నానని, బీసీలను చైతన్యపర్చడానికే పాదయాత్ర చేపట్టానని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సోమవారం సాయంత్రం యాదగిరిగుట్టకు తీన్మార్ మల్లన్న పాదయాత్ర చేరుకున్న సందర్భంగా ఆ పార్టీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా వద్ద కూడలి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు.

2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించినప్పుడు రూ.16 వేల కోట్లు మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగిస్తే ముఖ్యమంత్రిగా నాడు కేసీఆర్ ప్రజాధనాన్ని లూటీ చేసి అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అప్పుడే మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి కేసీఆర్‌పై పోరాటం చేశానని అన్నారు. కేసీఆర్‌ను వ్యతిరేకించినందుకు నాపై, నా కార్యాలయంపై దాడులు చేసి చీకటి రూముల్లో నన్ను బందించి హింసించారన్నారు.

తెలంగాణలో జరిగిన గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీ బీసీలకు ప్రత్యేక ప్రాధాన్యత,రిజర్వేషన్ కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎన్నికల మేనిఫెస్టోలో తెలపడంతో కాంగ్రెస్‌లో చేరి 45 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా 43 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను గెలిపించానని,అందులో ఆలేరు ఒకటని అన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను విస్మరించారని తెలంగాణ రాష్ట్రంలోని రెడ్ల, వెలమల తిప్పికొట్టాలని, అప్పుడే బీసీలకు రాజ్యాధికారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రికి పరిపాలనా విధానం తెలియదని విమర్శించారు. 56 శాతమున్న బీసీలకు 15 స్థానాలు ఉండగా 4.5 శాతం ఉన్న రెడ్డిలు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలుగా ఉన్నారని అన్నారు. ప్రజా పరిపాలనలో ఒక రెడ్డి ఇంటికి సంక్షేమ పథకాల పేరుతో రూ.5 లక్షలు చెల్లిస్తే బీసీలకు రూ.2, 3 లక్షలు మాత్రమే చెల్లించారని ఆరోపించారు. టీఆర్పీ అధికారంలోకి వస్తే నిరుపేదలకు కోటి ఎకరాల భూమి పంచుతామని హామీ ఇచ్చారు. బీసీల ఐక్యత కోసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్పీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర,జిల్లా,మండల స్థాయి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు.. రోగులకు మెరుగైన వైద్యం అందించాలి
- పరిశుభ్రత, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్ నిర్వహణపై క్షుణ్ణంగా పరిశీలన

✍ జయభేరి, బూర్గంపాడు:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ సోమవారం ఉదయం బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్, అక్కడ అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆసుపత్రి నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ల్యాబ్, ఓపీ విభాగం, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు పట్టికతో పాటు పలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి చికిత్స కోసం వస్తున్న రోగుల సంఖ్య, వారికి అందిస్తున్న వైద్య సేవలు, నిర్వహిస్తున్న పరీక్షలు, మందుల పంపిణీ విధానం గురించి వైద్యులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ల్యాబ్ పరీక్షలు సకాలంలో నిర్వహిస్తూ రోగులకు అవసరమైన వైద్య నివేదికలను అందించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, ఎల్లప్పుడూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ బాధ్యతతో వైద్య సేవలు అందించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు తక్షణ వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని, 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం అత్యంత ప్రాధాన్యతతో కూడిన బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నట్లు తెలిసింది. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో ఆసుపత్రి సిబ్బందిలో ఒక్కసారిగా అప్రమత్తత నెలకొంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను పెంచడం, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడం, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ఉన్నతాధికారులు తనిఖీలు చేపడుతున్నట్లు ఈ పర్యటన ద్వారా స్పష్టమవుతోంది. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాద్, డాక్టర్ అమరేందర్ రెడ్డి, ఇతర వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అనేది పేద ప్రజలకు కొండంత అండ. అక్కడ అందే ప్రతి వైద్య సేవ రోగికి భరోసానివ్వాలి. ఆసుపత్రి గడప తొక్కిన ఏ ఒక్కరికీ వైద్యం విషయంలో ఇబ్బంది కలగకుండా చూడటం ప్రతి వైద్య సిబ్బంది బాధ్యత."





డేటింగ్ యాప్‌తో రూ.14.13 లక్షల మోసం

✍ జయభేరి, మేడిపల్లి :

ఫేస్‌బుక్ యాడ్‌తో డేటింగ్ యాప్ వలలో చిక్కిన ఓ వ్యక్తి రూ.14.13 లక్షలు పోగొట్టుకున్నాడు. బోడుప్పల్‌కు చెందిన నాంపల్లి సమరేష్ (50)కు 'వింక్ మీ' ద్వారా పరిచయమైన కావ్య సాన్వి పెట్టుబడుల పేరుతో నమ్మించింది. తొలుత లాభాలు చూపించి, క్రెడిట్ స్కోరు, విత్‌డ్రా ఛార్జీలంటూ 49 లావాదేవీల్లో డబ్బులు గుంజారు. నకిలీ కోర్టు ఉత్తర్వులతోనూ మభ్యపెట్టారు. మరో రూ.4.50L డిమాండ్ చేయడంతో సైబర్ PSలో ఫిర్యాదు చేశాడు.

వాటర్ వర్క్స్ జీఎం సంతోష్ తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమీక్ష సమావేశం



✍ జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని వాటర్ వర్క్స్ సమస్యలపై జీఎం సంతోష్ తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామకంఠం పరిధిలో ఉన్న పాత గ్రామాలైన కుషాయిగూడ, చెర్లపల్లి, నాచారం, మల్లాపూర్ ప్రాంతాల ప్రజలకు ఇతర ప్రాంతాలతో పోలిస్తే అధిక మొత్తంలో నీటి బిల్లులు వస్తున్నాయని ఎమ్మెల్యే జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి నివసిస్తున్న పాత గ్రామాల ప్రజలపై అధిక నీటి బిల్లుల భారం పడకుండా చూడాలని, బిల్లుల విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ వినియోగానికి అనుగుణంగా బిల్లులు జారీ చేయాలని కోరారు. ప్రజలపై అనవసరమైన ఆర్థిక భారం పడకుండా సమస్యను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు.



ఉప్పల్ బాగాయత్ లో గల కాల భైరవ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆ కాల భైరవ స్వామి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

✍ జయభేరి, ఉప్పల్

సదర్ సమ్మేళనం వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

- రామంతాపూర్‌లో నిర్వహించిన అవులగడ్డ సదర్ సమ్మేళనంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



✍ జయభేరి, ఉప్పల్ :

హైదరాబాద్‌లోని రామంతాపూర్ గాంధీనగర్, 2వ వీధిలో అవులగడ్డ నరేందర్ యాదవ్ నివాసంలో ఆదివారం నిర్వహించిన 2026 సదర్ సమ్మేళనం కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సదర్ ఉత్సవాల్లో భాగంగా యాదవ సోదరులు నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు సదర్ సమ్మేళనం ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. యాదవుల ఆత్మగౌరవం, ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన అవులగడ్డ నరేందర్ యాదవ్‌కు అభినందనలు తెలియజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం..

✍ జయభేరి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ :

సిర్పూర్ మండలం దుబ్బగూడలో ఎల్ములే మోహన్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల కోసం బయటకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరగడంతో మంటలు వేగంగా వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులు, ధాన్యం కాలిపోయాయి. ఏడాది పాటు కష్టపడి సంపాదించిన రూ.2.5 లక్షల నగదు కూడా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారణ చేపట్టారు.



హైవేలపై అండర్ పాస్‌లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 09 :

యాదగిరిగుట్ట మండలంలోని చిన్నకందుకూరు, పెద్దకందుకూరు, బాహుపేట,రామాజీపేట గ్రామాల దగ్గర హైవేపై అండర్ పాసులు నిర్మించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు.సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి సీపీఐ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నకందుకూరు, పెద్దకందుకూరు, రామాజీపేట,బాహుపేట గ్రామాల ప్రజలు నేషనల్ హైవే నుండి గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ఎక్కువగా ప్రమాదాలు జరిగి అనేక మంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రయాణికుల కోసం ఆయా గ్రామాల స్టేజీల దగ్గర అండర్ పాస్ బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు.సీపీఐ నేతల వినతిపై స్పందించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆయా గ్రామాల దగ్గర పరిస్థితులను నేరుగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ,ఎండి ఇమ్రాన్, ఏఐవైఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పేరబోయిన మహేందర్,యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, నేతలు పెరబోయిన బంగారి,గోపగాని రాజు,బోదాసు జగన్,కంబాల వెంకటేష్, ముక్కెర్ల పెంటయ్య, అనంతుల నరసింహ,శెట్టి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాల ఏర్పాట్లను పరిశీలించిన యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్



జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 09 :

కార్తీక మాసం సదర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనార్థం భక్తులు భారీగా తరలివస్తారని,రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ సూచించారు. సోమవారం ఆలయంలో కార్తీకమాసోత్సవాల ఏర్పాట్లలో భాగంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాల ఏర్పాట్లను ఆలయ ఈవో పరిశీలించారు. యాదాద్రి క్షేత్రం శ్రీసత్యనారాయణ స్వామి వారి వ్రతాలకు ప్రసిద్ధి కావడంతో భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని, భక్తుల రద్దీకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని,అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా వ్రత మండపంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు,వ్రతాల నిర్వహణ, భక్తుల రాకపోకలు,వసతి సౌకర్యాలు,క్యూలైన్ల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. గతంలో నిర్వహించిన పలు సమీక్ష సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలు,సూచనల అమలుపై అడిగి తెలుసుకున్నారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణంలో శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు,సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింట్లో పండుగ వెలుగులు!

- కొత్త ఇళ్లలో లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకున్న ఇందిరమ్మ ఇళ్లలో కలెక్టర్, ఎమ్మెల్యేతో లబ్ధిదారుల దీపావళి సంబరాలు!
- నూతన గృహాల్లో పండుగ వేడుకలు.. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య



జయభేరి, చేవెళ్ల, నవంబర్ 09 :

చేవెళ్ల నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వారు వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లో దీపావళి పండుగ జరుపుకుంటున్న లబ్ధిదారులతో కలెక్టర్, ఎమ్మెల్యే ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్లలో పండుగ జరుపుకోవడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేసి పండుగ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు జైలు శిక్ష

- ఐఏఎస్ తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

జయభేరి, రంగారెడ్డి జిల్లా :



కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన కేసులో (కోర్టు ధిక్కరణ) రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి తెలంగాణ హైకోర్టు 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ. 2,000 జరిమానా విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. న్యాయస్థానం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు ఐఏఎస్ (IAS) అధికారి తీరుపై జస్టిస్ కె. లక్ష్మణ్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భూముల వివాదం: రంగారెడ్డి జిల్లాలోని మూడు ల్యాండ్ పార్సిళ్లను (ప్లాట్లను) రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22A ప్రకారం 'నిషేధిత ఆస్తుల జాబితా' (Prohibited Properties List) నుంచి తొలగించాలంటూ బాధితులు దరఖాస్తు చేసుకున్నారు.

కోర్టు ముందస్తు ఆదేశాలు:

దీనిపై స్పందించిన తెలంగాణ హైకోర్టు 2025 ఆగస్టులో ఒక ఉత్తర్వు జారీ చేస్తూ.. బాధితుల అభ్యర్థనను 60 రోజుల్లోగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. కలెక్టర్ నిర్లక్ష్యం: కోర్టు గడువు విధించినప్పటికీ కలెక్టర్ నిర్ణీత సమయంలోగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో బాధితులు 2025 అక్టోబర్ 15న హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.

హడావుడి చర్యలు:

కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే యంత్రాంగం కదిలి, హడావుడిగా నోటీసులు ఇచ్చి 2026 ఫిబ్రవరిలో, ఆపై జూలైలో సదరు వినతిని తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

హైకోర్టు ఆగ్రహం & తీర్పు

కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసిన తర్వాతే అధికారులు స్పందించి అప్లికేషన్ తిరస్కరించడంపై హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. పక్కనే ఉన్న మరో ప్లాట్‌ను నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితుల ప్లాట్లను మాత్రం ఉద్దేశపూర్వకంగా కాలరాసే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు సరైనవా కావా అని ప్రశ్నించే హక్కు అధికారులకు లేదని, ఆదేశం ఏదైనా ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని సుప్రీంకోర్టు తీర్పులను ఉటంకిస్తూ స్పష్టం చేసింది. కలెక్టర్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో ఆయనను దోషిగా తేల్చి శిక్ష ఖరారు చేసింది.

4 వారాల పాటు శిక్ష నిలిపివేత

కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష విధించినప్పటికీ, ఈ తీర్పుపై ఆయన సైకోర్టులో (అప్పీల్) సవాల్ చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును హైకోర్టు 4 వారాల పాటు నిలిపివేసింది.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు!

- లబ్ధిదారులతో కలిసి పండుగ సంబరాలు..
- సొంతింటి కల నెరవేరడంతో కుటుంబాల్లో ఆనందం

జయభేరి, షాబాద్, నవంబర్ 09 :





షాబాద్ మండలంలోని ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన గ్రామాల్లో దీపావళి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు దీపావళి సంబరాల్లో పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు,వార్డు సభ్యులు, గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి దీపాలు వెలిగించారు. మిఠాయిలు పంచుకుంటూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారమవుతుండటంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సొంతింటిలో దీపావళి జరుపుకోవడం లబ్ధిదారుల కుటుంబాల్లో ప్రత్యేక సంతోషాన్ని నింపింది. ప్రజాప్రతినిధులు లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఆత్మీయ అభిమానం..

భీం భరత్‌కు ఘన సన్మానం..పేదల సంక్షేమమే తన ధ్యేయం

- పామేన భీం భరత్
- చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన షాబాద్ చేవెళ్ల మొయినాబాద్ మండల నాయకులు కాంగ్రెస్ శ్రేణులు

జయభేరి, షాబాద్, నవంబర్ 09 :







చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీం భరత్ జన్మదినాన్ని పురస్కరించుకుని షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు భీం భరత్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల సంక్షేమం, ప్రజాసేవే ధ్యేయంగా ఆయన పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని నాయకులు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్, చేవెళ్ల, గ్రామాల కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్లు సర్పంచ్లు కూడా పాల్గొన్నారు షాబాద్ సర్పంచ్ అశోక్, తమ్మలి రవీందర్, మన్మరి మాజీ సర్పంచ్ సత్యం, మంగలి చెన్నయ్య, రామ్ రెడ్డి, ఇంద్రా రెడ్డి, బర్క వెంకటయ్య, దేవయ్య, శ్రీరామ్ రెడ్డి, బర్క సాయన్నతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.




యాదగిరిగుట్ట నుంచి పంచారామాలకు ఆర్టీసీ బస్సులు

- భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు : యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్ కుమార్

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 09 :

కార్తీకమాసం సందర్భంగా యాదగిరిగుట్ట ప్రసిద్ధ క్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి క్షేత్రం నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు.సోమవారం యాదగిరిగుట్టలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రతీ ఆదివారం సాయంత్రం పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఈ నెల 22,29,వచ్చే నెల 6వ తేదీలలో యాదగిరిగుట్ట నుంచి అమరావతి,భీమవరం సోమారామం,పాలకొల్లు క్షీరారామం,ద్రాక్షారామం, సామర్ల కోట్ల ఆలయాలకు ప్రతీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు యాదగిరిగుట్ట నుంచి ఆర్టీసీ బస్సు బయల్దేరుతుందని, పంచారామాల దర్శనం అనంతరం తిరిగి మంగళవారం తెల్లవారుజామున యాదగిరిగుట్టకు చేరుకుంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు, స్థానికులు సద్వినియోగం చేసుకొని కార్తీక మాసంలో పంచారామాలకు దర్శనం చేసుకోవాలని కోరారు.

వాసవి మాత ఆలయంలో వెలిగిన ఆకాశదీపం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం రాత్రి ఆకాశ దీపాన్ని వెలిగించారు. ప్రతి ఏడాది కార్తీక మాసం ప్రారంభం రోజు ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే దేవస్థానంలో ఈ ఆకాశదీపం పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రధాన అర్చకుడు తరిమల హరి శంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పునాదిపాడు లో బీహార్ యువకుడి దారుణ హత్య

జయభేరి, పెనమలూరు :

కంకిపాడు మండలంలో దారుణం జరిగింది. పునాదిపాడు వద్ద ఉన్న స్థానిక వెస్ట్ ఫ్లైఓవర్ సమీపంలోని డైరీ ఫామ్లో పని చేస్తున్న అనిల్ కుమార్ యాదవ్ అనే బీహార్ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అనిల్ కుమార్ యాదవ్పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి చంపినట్లు సమాచారం. తోటి బీహార్ కార్మికులే ఈ హత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి.



రైతుల సభకు మహిళా సంఘాల సభ్యుల తరలింపా?

- మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి
- రైతులకు రుణమాఫీ లేదు.. సభలకు మాత్రం జనసమీకరణ!
- రైతుల సభనా.. కాంగ్రెస్ ప్రచార సభనా?
- ముందు పూర్తి స్థాయి రుణమాఫీ చేయండి.. ఆ తర్వాత రైతుల సభలు పెట్టండి!
- మహిళా రైతుల పేరుతో హడావుడి.. రైతుల సమస్యలపై మౌనం!
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ జెడ్పిటిసి పట్నం రెడ్డి, ఘాటు విమర్శలు

✍ జయభేరి, చేవెళ్ల, నవంబర్ 09 :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటున్న రైతు బహిరంగ సభకు మహిళా సంఘాల సభ్యులను అధికారులే తరలిస్తున్నారంటూ చేవెళ్ల నియోజకవర్గ చేవెళ్ల టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సభ్యుడు, మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి, విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా సభలకు జనసమీకరణ చేయడంపై దృష్టి పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రైతుల సభకు మహిళా సంఘాల సభ్యులను తరలించడంపై అనుమానాలు వ్యక్తం చేసిన పట్నం అవినాష్ రెడ్డి,అధికారులను ప్రశ్నిస్తే వారు మహిళా సంఘాల నాయకులు కాదని, మహిళా రైతులని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. నిజంగా మహిళా రైతుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందుగా వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
షాబాద్ మండలంలో ఏ ఒక్క రైతుకూ రుణమాఫీ కాలేదని జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి ఆరోపించారు. రైతుల రుణమాఫీ, సాగు సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం సభలకు మహిళలను తరలించడంపై ఎందుకు ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా భారీ సభలు నిర్వహించడం వల్ల రైతులకు ఒరిగేదేమిటని నిలదీశారు.
సభలో రైతుల సమస్యలు ప్రస్తావిస్తే ఇబ్బందులు తప్పవా? మహిళా రైతులను పెద్ద సంఖ్యలో సభకు తరలిస్తే అక్కడ రైతుల సమస్యలపై అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉందని పట్నం అవినాష్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతుల వాస్తవ పరిస్థితులు బయటపడితే సభ రాజకీయ వేదికగా మారుతుందనే భయం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై చర్చ జరగాల్సిన సభల్లో కేవలం జనసమీకరణకే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని హితవు పలికారు. రైతులకు ఇచ్చిన హామీల అమలు, రుణమాఫీ పరిస్థితి, క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని పట్నం అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు. సభలకు ఎంతమంది వచ్చారనే లెక్కల కంటే ఎంతమంది రైతులకు న్యాయం జరిగిందనే లెక్కలు ముఖ్యమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం పేరుతో సభలు నిర్వహించడం కాదని, రైతుల సమస్యలను పరిష్కరించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వానికి నిజమైన పరీక్ష అని ఆయన వ్యాఖ్యానించారు. షాబాద్ మండల రైతుల రుణమాఫీ అంశంపై ప్రభుత్వం స్పందించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ ఉద్యోగాల నియామకాలు

- అర్హులైన, అనర్హులైన అభ్యర్థుల జాబితాల ప్రదర్శన - అభ్యంతరాల స్వీకరణకు అవకాశం
- ఇన్చార్జ్ డి డబ్ల్యూ.ఓ. శిరీష



✍ జయభేరి, మహబూబాబాద్ :

మహబూబాబాద్ జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ హెల్పర్ల నియామకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో అర్హులైన, అభ్యర్థుల ప్రాథమిక జాబితాలను గ్రామీణ ప్రాంతాలలో సంబంధిత గ్రామ పంచాయతీలో, పట్టణ ప్రాంతాలలో సంబంధిత మున్సిపాలిటీలో తేది.09.11.2026 నుండి 13.11.2026 వరకు ప్రదర్శించడం జరిగింది. సదరు జాబితాలలో తమ పేర్లు లేదా అర్హతలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు, తమ అభ్యంతరాలను తగిన ఆధార పత్రాలతో జత చేసి సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలలో సమర్పించవలసిందిగా తెలిపారు. కావున, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్దేశిత గడువు తేది.13.11.2026 లోపు తమ అభ్యంతరాలను సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయాలలో సమర్పించవలసిందిగా ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి శిరీష, నేడు ఒక ప్రకటన లో తెలిపారు.

బాణాసంచా కారణంగా ఖాళీ స్థలంలోని చెట్ల పొదల్లో భారీ మంటలు

- సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది
- దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలి

కౌన్సిలర్ పద్మాబాయి నర్సింగరావు



✍ జయభేరి, గజ్వేల్, నవంబర్ 9 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడంతో ప్రమాదవశాత్తుపక్కనే ఉన్నఖాళీ స్థలంలోని చెట్ల పొదలపై నిప్పురవ్వలు పడటంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి.ఒక్క సారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఖాళీ స్థలంలోని చెట్ల పొదలు మంటల్లో చిక్కుకోవడంతో ప్రమాదం మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని స్థానికులు భావించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ కళ్యాణ్కర్ పద్మాబాయి నర్సింగరావు వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు.సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ పద్మాబాయి నర్సింగరావు మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో పాటు భద్రతా జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు. బాణాసంచా కాల్చే సమయంలో చుట్టూ ఉన్న పరిసరాలను తప్పనిసరిగా గమనించాలని, చెట్ల పొదలు, ఖాళీ స్థలాలు, ఇళ్ల సమీపంలో టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బాణాసంచా కాల్చే సమయంలో నిర్లక్ష్యం వహిస్తే చిన్న నిప్పురవ్వ కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పండుగ ఆనందం ఎవరికీ ఇబ్బందులు కలిగించకుండా, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడం అభినందనీయమని కౌన్సిలర్ పద్మాబాయి నర్సింగరావు పేర్కొన్నారు.



పాములపర్తిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

పాములపర్తి గ్రామానికి చెందిన కుమ్మరి యాదగిరి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్, బీసీ సెల్ ప్రెసిడెంట్ మేకల కనకయ్య ముదిరాజ్, సర్పంచ్ భవాని బాలకిషన్, ఉప సర్పంచ్ జుట్టు సుధాకర్, వార్డు సభ్యులు కర్ణాకర్, శ్రీనివాస్, చక్కలి రాములు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షిస్తున్నాం.

అభివృద్ధికి ఆమడ దూరంలో తొర్రూర్ ఆర్ టిసి బస్టాండ్

- బస్టాండ్ ప్రాంగణం గుంతల మయంగా మారిన పట్టించుకోని అధికారుల తీరు
- అధికారుల నిర్లక్ష్యంతోపలు ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు

✍ జయభేరి, తొర్రూర్, నవంబర్ 9 :



అభివృద్ధికి ఆమడ దూరంలో తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ ఉండడం విశేషం .గత కొన్నేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి బస్టాండ్ నోచుకోకపోవడం స్థానికంగా చర్చనీ అంశంగా మారింది., గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న తీరుగా మారింది. 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొర్రూరు డివిజన్ కేంద్రం ప్రకటించడం తప్ప ఆర్టీసీ బస్టాండ్ తీరు మాత్రం" వెంకే పెండ్లి సుబ్బీచావు వచ్చిన చందంగా" మారింది. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ తీరు మాత్రం మారకపోవడం, శోచనీయం. అదేవిధంగా ఖమ్మం వరంగల్ మెయిన్ జాతీయ రహదారి పక్కనే ఈ బస్టాండ్ ఉండడం పట్టణ కేంద్రం దినదిన అభివృద్ధి చెందడం, మూలంగా, ఖమ్మం వరంగల్ జాతీయ మెయిన్ రహదారి నుండి వాహనాల యొక్క రాకపోకలు అధికంగా ఉంటాయి. అదే విధంగా బస్టాండ్ ప్రాంగణానికి వచ్చే బస్సులు నిరంతరం ఈ బస్టాండుకు, వస్తుంటా యి, అదే తరహాలో వందలాదిగా ప్రయాణికులు రాకపోకలు, సాగిస్తుంటారు. దీని మూలంగా బస్టాండ్ ప్రాంగణంలోకి అనునిత్యం బస్సులు వచ్చే రహదారి మాత్రం గుంతల మయంగా మారి, దుమ్ము ధూళి బస్టాండ్లోకి రావడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా కూడా గత కొంతకాలంగా అటు అధికారులు గానీ ఇటు ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు యొక్క పరిస్థితి "దినదిన గండం నూరేళ్లు ఆయుష్ లా మారింది. దీనికి కారణం ఆర్టీసీ అధికారుల అలసత్వమా, లేక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమా తెలియదు కానీ, నిర్లక్ష్యనీలి నీడల మధ్య ఆర్టీసీ బస్టాండ్ ఉండడం, అధికారుల పనితీరుకు అద్దం పట్టినట్టుగా కనిపిస్తుంది. కావున ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి,ప్రయాణికుల రక్షణకు తోడ్పడాలని కోరుతున్నారు.

యాదవుల ఐక్యతకు ప్రతీక సదర్ ఉత్సవాలు

- ఎద్దు నాగేష్
- తూముకుంటలో అంగరంగ వైభవంగా సదర్ ఉత్సవాలు..

✍ జయభేరి, మేడ్చల్ :



యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలు తూముకుంట గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో పండుగ శోభను నింపాయి. దున్నపోతుల దుంకులు, యాదవ యువకుల సయ్యాటలు,సంప్రదాయ నృత్యాలు, ఉత్సాహభరిత సందడితో సదర్ సంబరాలు అంబరాన్నంటాయి. యాదవ సమాజానికి సదర్ ఉత్సవాలకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. ప్రతి సంవత్సరం దీపావళి సందర్భంగా తమకులదైవమైన శ్రీకృష్ణుడిని స్మరించుకుంటూ, తమ జీవనోపాధికి ప్రధాన ఆధారమైన పాడి పశువులను భక్తిశ్రద్ధలతో పూజించడం ఆనవాయితీగా వస్తోంది. పశుసంపదను లక్ష్మీదేవి స్వరూపంగా భావించే యాదవులు వాటిని అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ భక్తిని చాటుకుంటారు.
ఈ వేడుకల ద్వారా తరతరాలుగా వస్తున్న యాదవుల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తున్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్పేట డివిజన్లో ఉన్న తూముకుంట గ్రామంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు యాదవ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతులు ప్రదర్శనలో పాల్గొని తమ విన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్నాయి.దున్నపోతుల దుంకులు,వాటి పోటాపోటీ విన్యాసాలను చూసేందుకు గ్రామస్తులు, యువత, చిన్నారులు ఆసక్తి చూపారు. యాదవ యువకుల సయ్యాటలు, కేరింతలు, సంప్రదాయ వేడుకలతో గ్రామమంతా కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా గ్రామంలో ఎటుచూసినా పండుగ వాతావరణం కనిపించింది. యాదవ సంఘం సభ్యులు సమష్టిగా ఏర్పాట్లు చేసి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు.గ్రామంలోని పెద్దలు,యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సంబరాలను తిలకించారు. యాదవుల ఐక్యతను, ఆచార వ్యవహారాలను చాటిచెప్పేలా సదర్ ఉత్సవాలు ఘనంగా సాగాయి.
ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్ మాట్లాడుతూ సదర్ ఉత్సవాలు యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ప్రతి సంవత్సరం దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించే ఈ వేడుకలు యాదవుల ఐక్యతకు, ఆత్మీయతకు నిదర్శనమని పేర్కొన్నారు. తమ కులదైవమైన శ్రీకృష్ణుడిని పూజించడంతో పాటు, యాదవ కుటుంబాలకు జీవనాధారమైన పాడి పశువులను భక్తిశ్రద్ధలతో పూజించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. యువత సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యాదవులందరూ ఐక్యంగా ఉంటూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎద్దు శ్రీనివాస్ యాదవ్, బొల్లబోయిన పరమేష్ యాదవ్, బొల్లబోయిన చంద్రశేఖర్ యాదవ్, బిక్షపతి యాదవ్, సాయి యాదవ్, మహేష్ యాదవ్, బాలయ్య యాదవ్, నాగేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కిట్టు యాదవ్తో పాటు పలువురు యాదవ సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.



చిన్నచింతకుంటలో ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- నినాదాలతో మార్మోగిన చిన్నచింతకుంట

✍ జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ "జై రేవంత్ రెడ్డి.. జై జిఎంఆర్ " అంటూ చిన్నచింతకుంట మండల కేంద్రాన్ని నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కేటీఆర్ తో కలిసి పాటను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే ఆల



✍ జయభేరి, దేవరకద్ర :

ఆపద సమయంలో తనకు అండగా నిలిచి సహాయం చేసిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి కృతజ్ఞతగా జగిత్యాల పట్టణానికి చెందిన రుద్ర రచించిన పాటను కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు తదితరులు పాల్గొన్నట్లు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే జిఎంఆర్ జన్మదిన శుభాకాంక్షలు



✍ జయభేరి, దేవరకద్ర :


తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ కు వెళ్లి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యమంత్రి కి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హకీంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించిన ముఖాముఖి మరియు పించన్ల పంపిణీ కార్యక్రమం సభలో కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్ జాలిగామ ఆనంద్‌కు ఘన సన్మానం



✍ జయభేరి, గజ్వేల్:

సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్‌గా నియమితులైన జాలిగామ ఆనంద్‌ను గజ్వేల్ మండల కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తోప్పల యాదగిరి ఆధ్వర్యంలో సంఘం నాయకులు జాలిగామ ఆనంద్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కుమ్మరి కులస్తులకు దేవాలయాల్లో అర్చకులుగా అవకాశం కల్పించి, తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మరి సామాజిక వర్గ అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు నాగపురి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డేపల్లి యాదగిరి, గజ్వేల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొలిచెలిమె స్వామి, మండల గౌరవ అధ్యక్షులు నాగపురి బాబు, అసోసియేట్ అధ్యక్షులు బైకాడి పోచయ్య, గౌరవ సలహాదారు కొలిచెలిమె మల్లేశం, ఉపాధ్యక్షులు దాకూరి వీరేశం, కుమ్మరి రాజలింగం, ప్రధాన కార్యదర్శి నాగపురి చందు, ప్రచార కార్యదర్శి కనుగుల విఠల్, యూత్ అధ్యక్షులు నాగపురి కిషన్, మాజీ అధ్యక్షులు బాయికాడి యాదగిరి, గజ్వేల్ పట్టణ అధ్యక్షులు బోర్ర స్వామి, జాలిగామ కుమ్మరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని కలిసి దీపావళి శుభాకాంక్షలు

✍ జయభేరి, దేవరకొండ :

నల్లగొండ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి వర్యులు సుర్యపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డిని కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ అనంతరం జగదీష్ రెడ్డి కేతావత్ బీల్యా నాయక్ తో దేవరకొండ ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. BRS నాయకులు జైపాల్ నాయక్, నాగార్జున నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డికి దీపావళి శుభాకాంక్షలు



✍ జయభేరి, డిండి :

మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ యువ నాయకులు ఓర్సు ముత్యాలు. మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి ని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఓర్సు ముత్యాలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి గారితో ఆత్మీయంగా మాట్లాడి పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. బిఆర్ఎస్ పార్టీ యువత మరింత చురుకుగా పనిచేయాలని పార్టీ అధినేత కెసిఆర్ నాయకత్వంలో పార్టీ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన అన్నారు. దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం గ్రామం వావిల్ కోల్ వడ్డెర గూడెం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఓర్సు ముత్యాలు బిఆర్ఎస్ జెండా ఎగరేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి



✍ జయభేరి, వలిగొండ, నవంబర్ 9 :

మండలంలోని అక్కంపల్లి ఏదులగూడెం ప్రొద్దుటూరు టేకుల సోమవారం దాసిరెడ్డిగూడెం గ్రామాల ఇందిరమ్మ ఇండ్లను ఎంపీడీవో జలంధర్ రెడ్డి సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు ప్రభుత్వ ఆదేశానుసారం వెంటనే ఆలస్యం చేయకుండా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల జాబితాను రద్దు పరచాలి

- గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి
- రాజకీయాలకు తావు లేకుండా పేదలకు ఇండ్లు మంజూరు చేయాలి



✍ జయభేరి, వలిగొండ, నవంబర్ 9 :

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితాలో గ్రామ పంచాయతీ పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా పట్టణాలలో బహుళ అంతస్తులు ఉన్నవారికి, ఆర్థిక అభివృద్ధి ఉన్నవారికి ఏకపక్ష నిర్ణయంతో ఇళ్లను కేటాయించడం తో నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని వెలువర్తి గ్రామ మాజీ సర్పంచ్ మల్లం శ్రీనివాస్ గౌడ్ సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో లబ్ధిదారుల జాబితాను రద్దు పరచాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికార పార్టీ నాయకులు వారి ఇష్టానుసారంగా గ్రామసభ నిర్వహించకుండా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం విడ్డూరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల జాబితా పై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

టిడిపికే ప్రజలు జేజేలు

- తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వరలక్ష్మి రవికుమార్ 221 ఓట్ల మెజారిటి

✍ జయభేరి, అగళి, నవంబర్ 09 :



అగళి మండలంలోని ఉమ్మడి నరసంబూది పంచాయితి నందు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వరలక్ష్మి రవికుమార్ 221 ఓట్ల మెజారిటి తో విజయం సాధించారు. ఈ సందర్భంగా పంచాయితి నందు మహిళా,పురుషులు మొత్తం 3070 ఓటర్లు వుండగా 2434 ఓట్లు పోల్ అయ్యాయి.ఇందులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వరలక్ష్మి రవికుమార్ 1207ఓట్లు సాధించారు. వైసిపి ఆభ్యర్థి యల్లమ్మ 986ఓట్లు,కాంగ్రెస్ 134 ఓట్లు, ఇండిపెండెంట్ 56 ఓట్లు, చెల్లని ఓట్లు 25, నోట 26ఓట్లు, పడగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వరలక్ష్మి రవికుమార్ 221ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించారు.తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వరలక్ష్మి రవికుమార్ మాట్లాడుతూ నాకు అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు, మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్.రాజు, మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి అన్నలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అలాగే నన్ను ఇంతగా ఆదరించి ఓట్లతో ఆశీర్వదించిన పంచాయితి ప్రజలకు మీ ప్రేమాభిమానాలకు మా ధన్యవాదములు తెలిపారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని అని పేర్కొన్నారు. అనంతరం ఎన్నికల అధికారి మోహన్ రావు చేతుల మీదుగా డిక్లరేషన్ ఫారాన్ని శనివారం అందుకున్నారు. ఆమె గెలుపుతో తెదేపా పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగు తమ్ముళ్ళు పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో హాజరై బాణాసంచా కాల్చారు, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు.

పూడూరులో ఘనంగా సదరు ఉత్సవాలు

✍ జయభేరి, మేడ్చల్ :



మేడ్చల్ సర్కిల్ పరిధి పూడూరుకిష్టాపూర్ డివిజన్ పూడూరులో గ్రామంలో ఆదివారం దీపావళి సందర్భంగా సదరు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి,ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్టెప్పులేసి సందడి చేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ సదరు ఉత్సవాలను పురస్కరించుకొని యాదవులందరూ పశువులను పూజిస్తారని పేర్కొన్నారు.తాను కూడా చిన్నప్పుడు పశువులను పెంచి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు.50 సంపత్సరాల క్రితం తాను కూడా సదరు ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లుగా చెప్పారు. గ్రామస్తులందరూ కులమత బేధాలు లేకుండా సదరు ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్,మాజీ సర్పంచ్ బాబు యాదవ్,మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్,పెద్ద గొల్ల శ్రీశైలం యాదవ్,మాజీ కౌన్సిలర్లు మధుకర్ యాదవ్,స్వామి యాదవ్,శ్రీ కృష్ణా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్,మాజీ వార్డు సభ్యులు కోలా వెంకటేష్,శేఖర్ రెడ్డి,జనార్ధన్ యాదవ్,శేషి కుమార్ యాదవ్, శ్రీకాంత్ ముదిరాజ్,హన్మంత్ రెడ్డి,రేగు నగేశ్, నాయకులు అకిటి నవీన్ రెడ్డి,బాసుపల్లి రాంరెడ్డి,కటకం లక్ష్మణ్,డప్పు కృష్ణ,మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్,మాజీ సొసైటీ చైర్మన్ సత్తి రెడ్డి, యాదవ సంఘం నాయకులు మల్లేష్ యాదవ్, గోపాల్ యాదవ్,కృష్ణ యాదవ్,రాములు యాదవ్,శ్రీశైలం యాదవ్,అనిల్ యాదవ్,నిమ్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.జి.పల్లిలో టిడిపి ఘన విజయం

- తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రేణుకమ్మ388 ఓట్ల మెజారిటి

✍ జయభేరి, అగళి, నవంబర్ 09 :




అగళి మండలంలోని రాగేలింగనహళ్లి పంచాయితి నందు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీమతి రేణుకమ్మ388 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా పంచాయితి నందు మహిళా,పురుషులు మొత్తం 2329 ఓటర్లు వుండగా 1865 ఓట్లు 79శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీమతి రేణుకమ్మ 1094 ఓట్లు సాధించారు. వైసిపి ఆభ్యర్థి తిమ్మరాజమ్మ 706ఓట్లు పై తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీమతి రేణుకమ్మ 388 ఓట్ల మెజారిటితో అద్భుత విజయం సాధించారు.తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీమతి రేణుకమ్మ మాట్లాడుతూ నన్ను నమ్మి నాకు అమూల్యమైన ఓటు వేసి వేయించి గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అని పేర్కొన్నారు. అసంతరం ఎన్నికల అధికారి మోహన్ రావు చేతుల మీదుగా డిక్లరేషన్ ఫారాన్ని శనివారం అందు కున్నారు. ఆమె గెలుపుతో తెదేపా పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగు తమ్ముళ్ళు పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో హాజరై బాణాసంచా కాల్చారు, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు.

హైదరాబాద్‌పై కాలుష్య పంజా..

- ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం
- హైదరాబాద్‌ను వణికిస్తున్న వాయు కాలుష్యం
- ప్రమాదకరంగా 410కి చేరిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో అత్యధిక కాలుష్యం
- సాధారణం కంటే నాలుగు రెట్లు పెరిగిన పీఎం 2.5 స్థాయిలు
- వాహనాలు, నిర్మాణాలే ప్రధాన సమస్యగా గుర్తింపు

✍ జయభేరి, హైదరాబాద్ :



ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ దుర్మరణం

✍ జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 09 :

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి చెందిన విషాద ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి గ్రామ శివారు ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం కొండాపురం గ్రామానికి చెందిన పల్లపు మహేందర్ (మహేష్) గత ఎనిమిదేళ్లుగా భారత సైన్యంలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్‌తో పాటు పంజాబ్ ప్రాంతాల్లో దేశ సరిహద్దుల్లో సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం సెలవుపై స్వగ్రామమైన కొండాపురానికి వచ్చారు. సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా పీర్లపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ములుగు మండలం లక్ష్మక్కపల్లి గ్రామంలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎనిమిదేళ్లుగా దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో సేవలందించిన మహేందర్ అకాల మరణవార్తతో కొండాపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నిరుపేద కుటుంబానికి చెందిన మహేందర్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. దేశానికి సేవలందించిన జవాన్ మృతిపట్ల గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రావుడిలో టిడిపి విజయభేరి

- తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రమ్య నరసింహప్ప 338 ఓట్ల మెజారిటి



✍ జయభేరి, అగళి, నవంబర్ 09 :

అగళి మండలంలోని ఉమ్మడి రావుడి పంచాయితి నందు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రమ్య నరసింహప్ప 338 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా పంచాయితి నందు మహిళా, పురుషులు మొత్తం 2946 ఓటర్లు వుండగా 2486 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రమ్య నరసింహప్ప 1310 ఓట్లు సాధించారు. వైసిపి ఆభ్యర్థి రేఖ 961 ఓట్లు, బి.జె.పి 138 ఓట్లు,కాంగ్రెస్ 50ఓట్లు ఇతరుల పై తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రమ్య నరసింహప్ప 338 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించారు.తెదేప అభ్యర్థి రమ్య నరసింహప్ప మాట్లాడుతూ నన్ను నమ్మి నాకు అమూల్యమైన ఓటు వేసి వేయించి గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని అని పేర్కొన్నారు. అసంతరం ఎన్నికల అధికారి మోహన్ రావు చేతుల మీదుగా డిక్లరేషన్ ఫారాన్ని శనివారం అందు కున్నారు. ఆమె గెలుపుతో తెదేపా పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగు తమ్ముళ్ళు పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో హాజరై బాణాసంచా కాల్చారు, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు.

ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు స్వీకరణ



✍ జయభేరి, వలిగొండ, నవంబర్ 9 :

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు నోడల్ అధికారి జలంధర్ రెడ్డి తెలిపారు.



నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

హైదరాబాద్ ఫిబ్రవరి 3 :

మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.

కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్దకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.

30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యూరేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్‌గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

ముఖం స్లిమ్ గా కనిపించడం

జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మరికవరీని వేగవంతం చేస్తాయి. సన్ డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇరిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.





దాదా ధమాకా

అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మాస్ ఎంటర్‌టైనర్ 'దాదా'. మలినేని గోపీచంద్ దర్శకుడు. వెంకట సతీశ్ కిలారు నిర్మాత. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఓ కలర్‌ఫుల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. బాలకృష్ణ, నర్గీస్ ఫక్రీపై చిత్రీకరించిన 'దాదా ధమాకా' పాటకు సంబంధించిన స్టిల్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. లెదర్ జాకెట్, సన్ గ్లాసెస్‌తో పిస్టల్‌ని పైకి చూపిస్తూ..స్టైలిష్‌గా ఈ పోస్టర్‌లో బాలకృష్ణ కనిస్తుండగా, నర్గీస్ ఫక్రీ గ్లామరస్‌గా కనువిందు చేస్తున్నది. ఈ పాటను ఈ నెల 13న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటనలో పేర్కొన్నారు. తమన్ స్వరపరిచిన ఈ పాట సినిమాకు హైలైట్ కానున్నదని వారు అన్నారు. డిసెంబర్ 24న సినిమా విడుదల కానున్నది. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మంచు మనోజ్ కీలక పాత్రధారి. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: అరవింద్ ఎస్.కశ్యప్ ఐఎఫ్‌సీ

మార్మిక యోధుడు విరావి



మిస్టిక్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించిన 'పొలిమేర' సిరీస్ నుంచి వస్తున్న మూడో చిత్రం 'పొలిమేర3'. యాక్షన్‌కింగ్ అర్జున్, సత్యం రాజేష్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రధారులు. డాక్టర్ అనిల్ విశ్వనాథన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి, భరత్ నారంగ్ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమా నుంచి విరావి పాత్రలో అర్జున్ సర్జా గ్లింప్స్‌ని విడుదల చేశారు. అమావాస్యరోజు ఆలయంలోని చీకటి ప్రదేశాలను చూపిస్తూ గ్లింప్స్ ఆసక్తికరంగా మొదలైంది. ఆధ్యాత్మికత, మిస్టరీ, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో గ్లింప్స్ ఆకట్టుకుంది. మార్మిక యోధుడు విరావిగా గంభీరమైన రూపం, హావభావాలతో అర్జున్ కనిపించిన తీరు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఆయన పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని, పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు.



శ్రీలీల సంచలన నిర్ణయం..

శ్రీలీలకు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తీసుకొచ్చిన సినిమాల్లో 'పెళ్లి సందడి' ఒకటి. ఈ సినిమా తర్వాత రవితేజ హీరోగా నటించిన 'ధమాకా' ఆమె కెరీర్‌ను ఒక్కసారిగా మలుపు తిప్పింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో శ్రీలీలకు వరుస అవకాశాలు వచ్చాయి. తన అందం, అభినయం, ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా డ్యాన్స్ విషయంలో శ్రీలీలకు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. అద్భుతమైన గ్రేస్‌తో స్టెప్పులు వేయగలగడం ఆమెకు అదనపు బలంగా మారింది. దీంతో యువ హీరోలతో పాటు అగ్ర హీరోల సినిమాల్లోనూ నటించే అవకాశాలు దక్కాయి. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారిపోయింది. ఇదిలా ఉంటే శ్రీలీలకు సంబంధించి ప్రస్తుతం వినిపిస్తున్న మరో ఆసక్తికరమైన వార్త ఆమె రెమ్యునరేషన్‌కు సంబంధించినది. వరుస సినిమాలు చేస్తున్నప్పటికీ, కొన్ని చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో ఆమె తన పారితోషికాన్ని తగ్గించుకునే ఆలోచనలో ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు తనకున్న క్రేజ్, డిమాండ్‌ను బట్టి పారితోషికం తీసుకున్న శ్రీలీల.. ఇప్పుడు నిర్మాతలకు మరింత అందుబాటులో ఉండేలా రెమ్యునరేషన్ విషయంలో సర్దుబాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఆమె నిజంగానే పారితోషికం తగ్గించుకున్నారా? ఎంత మేరకు తగ్గించారు? అనే విషయాలపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.



ఆ రోజును మరిచిపోలేను

అత్యంత బిజీ బాలీవుడ్ కథానాయికల్లో జాన్వీకపూర్ ఒకరు. దేవర, పెద్ది సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు సైతం చేరువైన జాన్వీ.. ప్రస్తుతం లగ్ జా గలే, రాకా సినిమాలతో బిజీగా ఉన్నారు. నిత్యం ఏదో ఒక మాధ్యమం ద్వారా అభిమానులకు, ప్రేక్షకులకు చేరువలో ఉండే జాన్వీ.. తాజా ఇంటర్వ్యూలో తన తల్లి, దివంగత నటి శ్రీదేవితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'కథానాయికగా నా తొలి సినిమా 'ధడక్'(2018). అయితే.. ఆ సినిమాను ఒప్పుకునే ముందు ఇంట్లో చాలా పెద్ద డ్రామానే నడిచింది.
హీరోయిన్‌ని అవుతానని అమ్మకు చెప్పగానే ఒక్కసారిగా ఆమె షాకయ్యింది. 'అసలు నువ్వు కథానాయికగా సక్సెస్ కాగలవా?' అంటూ సంకోచించింది కూడా. ఎందుకంటే నా విషయంలో అమ్మకు పెద్ద నమ్మకం ఉండేది కాదు. తాను ఎంతో సంఘర్షణకు లోనైంది. 'ఈ రంగంలోకి వస్తే నీ జీవితాన్ని పూర్తిగా దీనికే అంకితం చేయాలి' అని సూటిగా నా కళ్లలోకి చూస్తూ చెప్పింది. ఆ రోజుని ఇప్పటికీ నేను మరిచిపోలేను' అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్.

"వేట్టువం" మూవీ నుంచి 'సెలబ్రేట్ రెసిలియెన్స్' వీడియో రిలీజ్



సరికొత్త కథా నేపథ్యాలతో అద్భుతమైన మేకింగ్ తోప్రేక్షకుల్నిమెస్మరైజ్ చేసే దర్శకుడు పా. రంజిత్ "వేట్టువం" టైటిల్ తో మరో భారీ యాక్షన్ చిత్రాన్ని మన ముందుకు తీసుకు రాబోతున్నారు. ఈ సినిమాలో ఆర్య, వి.ఆర్. దినేష్, శోభిత ధూళిపాళ్ల, కలైయరాసన్, మైమ్ గోపి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "వేట్టువం" సినిమాను లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ప్రొడ్యూసర్స్ ఎస్. సాయి దేవానంద్, ఎస్. సాయి వెంకటేశ్వరన్, పా.రంజిత్ నిర్మిస్తున్నారు. భారీ పాన్ ఇండియా యాక్షన్ మూవీగా తెరకెక్కుతున్న "వేట్టువం" సినిమా వచ్చే సంక్రాంతి పండక్కి వరల్డ్ వైడ్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "వేట్టువం" సినిమా నుంచి మేకర్స్ 'సెలబ్రేట్ రెసిలియన్స్..' వీడియో రిలీజ్ చేశారు. ఈ సినిమాలోని క్యారెక్టర్స్ తమ సహనాన్ని పరీక్షించే సందర్భం వచ్చినప్పుడు ఎలా తట్టుకుని నిలబడ్డాయో, తమ శక్తిని ఎలా ప్రదర్శించాయో చూపించడం ఈ వీడియోలో ఆకట్టుకుంటోంది. విభిన్న సమూహాల మధ్య ఉండే సంఘర్షణలు, పోరాటాలు, ఊహకందని సంఘటనలను ప్రధానాంశంగా తీసుకుని దర్శకుడు పా. రంజిత్ "వేట్టువం" సినిమాను రూపొందిస్తున్నారు. "వేట్టువం" పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ ఎక్సిపీరియన్స్ అందించబోతోంది. నటీనటులు ఆర్య, వి.ఆర్. దినేష్, శోభిత ధూళిపాళ్ల, కలైయరాసన్, మైమ్ గోపి, గురు సోమసుందరం, షబీర్ కల్లరక్కల్, జాన్ విజయ్, సాయి దీన, ఆనంద్ సామి, హరీశ్ ఉత్తమన్, లిజీ, లింగేష్ ప్రేమ్ కుమార్, కవిత భారతి, అర్జున్, శాంతకుమార్, మెలోడీ మనీషా.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**